సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



మా సొమ్మే తినాలా..

తినక తినక మా సొమ్మే తినాలా.. సమాధానం చెప్పండి అంటూ శ్రీవారి దేవస్థానం పారిశుధ్య కార్మికులు కొండపైన సంబంధిత అధికారిని నిలదీశారు. 8లో ▸



పల్టీలు కొట్టిన స్కూటీ

పారిజాతగిరి ఘాట్ రోడ్డులో శనివారం స్కూటీ అదుపు తప్పి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీ 20 అడుగుల లోతు ఉన్న లోయలో పడిపోయింది. 8లో ▸



పట్టపగలు భారీ చోరీ

నూజివీడులో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో దొంగలు పడి 20 కాసుల బంగారు నగలు, 5 కిలోల వెండి అపహరించారు. 8లో ▸

న్యూస్‌రీల్

జగన్ మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారం



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వీరవాసరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ లడ్డు నాణ్యతపై కల్తీ జరిగిందంటూ మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ శనివారం ప్రశ్నించారు. ప్రజలందరికీ ఆరాధ్య దైవమైన వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ గత ప్రభుత్వంపై బురద జల్లడం అన్యాయమన్నారు. లడ్డూ ప్రసాదంలో వినియోగించే పదార్థాలను టెండర్ విధానంలో పిలిచి తక్కువ ధరకు కోట్ చేసినవారికి సరఫరా చేసే అవకాశం ఇచ్చారన్నారు. నాణ్యత లోపం కనిపిస్తే కచ్చితంగా వాటిని తిరిగి సప్లయిదారులకి పంపిస్తారని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం, జగన్‌మోహన్ రెడ్డిపై బురదజల్లే కార్యక్రమాలను చేపట్టడం అన్యాయం అన్నారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో నిజంగా కల్తీ జరిగి ఉంటే సీబీఐతో విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు.

70 తాటి టెంకలను మింగేసిన గేదె



బల్రింకలపాడులో అనారోగ్యానికి గురైన గేదె



పశువైద్యులు బయటకు తీసిన టెంకలు

కొయ్యలగూడెం: అరుదైన చికిత్సతో గేదె ప్రాణాన్ని కాపాడిన సంఘటన జీలుగుమిల్లి మండలం బల్రింకలపాడు పశు వైద్య కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. జీలుగుమిల్లి పశు వైద్య శాఖ ఏడీ సాయి బుచ్చారావు తెలిపిన వివరాల ప్రకారం.. బల్రింకలపాడు గ్రామానికి చెందిన నారం పుష్పకి చెందిన గేదె నెల రోజుల నుంచి బయటకు వెళ్లి మేత మేసే సమయంలో తాటి టెంకలు తినేది. రెండు రోజుల నుంచి తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో పాటు గేదె రెండు దవడలు విపరీతంగా వాచిపోయాయి. దీంతో గేదెను పశు వైద్య కేంద్రానికి తీసుకురాగా ఏడీ సాయి బుచ్చారావు ఆన్‌లైన్‌లో సిబ్బందికి సూచనలు సలహాలు అందిస్తూ గేదె దవడలలో ఉన్న టెంకలను బయటకు తీశారు. మౌత్ గ్యాగ్, వాక్యూనర్ ద్వారా పశు చికిత్స చేసే పరికరాల సహాయంతో గేదె కడుపులో ఉన్న టెంకలను బయటకు తీశారు. 70 టెంకల వరకు బయటకు తీయడంతో గేదె ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడింది.

28న మన ఇల్లు-మన గౌరవం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మంజూరైన గృహాలన్నింటినీ లక్ష్యం మేరకు పూర్తి చేయడానికి మన ఇల్లు-మన గౌరవం పేరుతో ప్రత్యేక గృహ నిర్మాణ అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మన ఇల్లు – మన గౌరవం అవగాహన కార్యక్రమంపై హౌసింగ్ ఇంజనీర్లు, ఎంపీడీవోలు, మండల స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్స్, ఈవోపీఆర్డీలు తదితరులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28న అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో రూఫ్ స్థాయికి వచ్చిన 3,242 వేల గృహాలను అక్టోబర్ 24 నాటికి, అలాగే బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న 5,512 గృహాలను 2025 మార్చి 25 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు.

రాయితీపై సోలార్ రూఫ్‌టాప్

ఏలూరు(మెట్రో): ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన లాంటి పథకాన్ని అందరూ స్వాగతించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శనివారం ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అవగాహన గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ఈ పథకం కింద రాయితీపై సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఇంటి కప్పుపై కనీసం 10 చ.మీటర్లు లేదా 100 చ.అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం ఉన్న రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సోలార్ రూఫ్ ఏర్పాటు కోసం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

మెడికలేనా!

- పాలకొల్లులో నిలిచిపోయిన వైద్య కళాశాల పనులు
- కళాశాల ఏర్పాటుకు రూ.475 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రూ.75 కోట్ల మేర పూర్తయిన పనులు
- కూటమి ప్రభుత్వం బిల్లులు విడుదల చేయక నిలిపివేసిన నిర్మాణ సంస్థ
- నిర్మాణ సామగ్రి వేరే ప్రాంతానికి తరలింపు
- కన్నెత్తి చూడని మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: జిల్లా వాసులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న పాలకొల్లు మెడికల్ కళాశాల ఇక అటకెక్కింది. కూటమి సర్కారు కక్ష రాజకీయాల వల్ల నిధులు విడుదల ఆపేయడంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. కళాశాల భవన నిర్మాణాల కోసం తెచ్చిన మెటీరియల్‌ను నిర్మాణ సంస్థ వేరే చోటికి తరలించుకుపోతోంది. తన సొంత ఇలాకలో ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాల పనులు ఆగిపోయినా మంత్రి నిమ్మల రామానాయుడు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం పనులు సాగడం లేదంటూ ఆయన ధర్నా చేయడం కొసమెరుపు. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా పాలకొల్లు మండలం దగ్గులూరులో సుమారు 60 ఎకరాల్లో రూ.475 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల మంజూరు చేశారు. భవన నిర్మాణాలు చేపట్టేందుకు వర్చువల్ పద్ధతిలో ఆయనే భూమిపూజ చేశారు. 2023 ఫిబ్రవరిలో ల్యాండ్ అగ్రిమెంట్ చేసుకున్న నిర్మాణ సంస్థ ఆగస్టులో పనులు ప్రారంభించింది. మొత్తం భవనాలను 16 బ్లాకులుగా డిజైన్ చేశారు. మూడు బ్లాకులకు సంబంధించిన పనులు మొదలపెట్టారు. వాటిలో ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ బ్లాక్‌ల ఫైల్స్ వర్క్ పూర్తవ్వగా, అత్యవసర సేవల బ్లాకుకు సంబంధించి 82 శాతం పనులు జరిగాయి. ఇంతవరకు రూ.74.5 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి.





ప్రస్తుతం కళాశాల సైట్ నుంచి లారీల్లో ఇసుక బయటకు తరలిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనులు జరుగుతున్న దృశ్యం(ఫైల్)

నిధులివ్వక నిలిచిన పనులు

నిర్మాణ పనులకు సంబంధించి మొదటి విడతగా రూ. 42.50 కోట్లకు బిల్లులు పెట్టగా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. పనులు పూర్తయిన మేర ఇంకా రూ.32 కోట్లకు బిల్లులు పెట్టాల్సి ఉందని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. నెలల తరబడి ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో గత 20 రోజులుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ సైట్‌లో ఉన్న ఐరన్, ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని నిర్మాణ సంస్థకు సంబంధించి మిగిలిన ప్రాంతాల్లో జరుగుతున్న పనుల వద్దకు తరలించుకుపోతున్నారు.

ప్రజల ఆశలపై నీళ్లు

పాలకొల్లులో మెడికల్ కళాశాల ద్వారా జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందడంతో పాటు పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాలోని పలు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అంతా భావించారు. ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని స్థానికులు ఆశించారు. నిర్మాణ పనులు నిలిచిపోవడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసే దిశగా కూటమి ప్రభుత్వ వైఖరి ఉండడంతో పాలకొల్లులో మెడికల్ కళాశాల ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. నిర్మాణ సామగ్రిని కాంట్రాక్టు సంస్థ తరలించుకుపోతుండటం అనుమానాలకు తావిస్తోందంటున్నారు. పాలకొల్లు ప్రాంత అభివృద్ధికి దోహదపడే మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసేందుకు మంత్రి నిమ్మల చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



నాడు పనులు జరుగుతున్నా నిరసన తెలుపుతున్న నిమ్మల రామానాయుడు, నిమ్మకాయల చినరాజప్ప (ఫైల్)

కన్నెత్తి చూడని మంత్రి నిమ్మల

ఒక పక్క పనులు జరుగుతుండగా.. బురద తప్ప ఇక్కడ నిర్మాణం ఏమీ జరగడం లేదంటూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలుమార్లు నిమ్మల రామానాయుడు హడావుడి చేశారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలల కాలంలో ఒక్కసారి కూడా మెడికల్ కళాశాల వైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో 95 శాతం పూర్తయిన ఏరియా ఆస్పత్రి భవనాన్ని మాత్రం నాలుగైదుసార్లు సందర్శించడం గమనార్హం. మెడికల్ కళాశాల నిర్మాణ పనులపై ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ బిల్లులు అడుగుతారన్న ఉద్దేశంతోనే మంత్రి నిమ్మల అటు వైపు కన్నెత్తి చూడటం లేదంటున్నారు. మెడికల్ కళాశాల పూర్తయితే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే ఆయన చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల చేయించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తీర ప్రాంతాన్ని పరిరక్షించుకుందాం



పేరుపాలెం బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేతలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

మొగల్తూరు: సహజ వనరుల్లో ఒకటైన సముద్రాన్ని కాలుష్యం నుంచి కాపాడుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. అంతర్జాతీయ తీర శుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం పేరుపాలెం బీచ్‌లో చేపట్టిన స్వచ్ఛ సాగర్ -సురక్షిత సాగర్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కాయిస్ సంస్థ చేపట్టిన కార్యక్రమంలో తీరం వెంట చెత్త, ప్లాస్టిక్, పర్యావరణ హానికరమైన ఇతర వ్యర్థాలు ఏరివేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తీర ప్రాంతాన్ని పరిరక్షించుకుంటే అనేక వేల పక్షి జాతులను పరిరక్షించుకోవచ్చన్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు పడేసే వ్యర్థాల కారణంగా తీర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయన్నారు. పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా 20 బోట్లతో గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ తీర ప్రాంతాలను సందర్శించే వారు సముద్ర తీర ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, డీఎస్పీ మురళీ కృష్ణ, తహసీల్దార్ విద్యాపతి, సర్పంచ్‌లు అందే వెంకటలక్ష్మి, తిరుమాని విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై నైపుణ్యం పెంపునకు దోహదం





న్యాయమూర్తులకు వర్క్ షాపులో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, వర్క్ షాప్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

ఏలూరు (టూటౌన్): మారుతున్న చట్టాలపై నైపుణ్యం పెంపొందించుకునేందుకు వర్క్ షాపులు దోహదం చేస్తాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అధ్యక్షతన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు ఏలూరు కోర్టు ప్రాంగణంలో వివిధ చట్టాలపై వర్క్‌షాపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాపులో 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్, చట్టం-పరిధి, తీర్పులు అమలు చేయడం, బాలలపై లైంగిక దాడులు(పోక్సో యాక్ట్) విచారణ, బాధితుల పరిహారం అనే అంశాలపై కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్, రిటైర్డ్ జిల్లా జడ్జి జీవీ కృష్ణయ్య, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది జంపన శ్రీదేవి రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ మాట్లాడుతూ చట్టాల్లో వస్తున్న మార్పుల అధ్యయనానికి వర్క్‌షాపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

మారని గీత కార్మికుల తలరాత

భీమవరం: రాష్ట్రంలో ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఆపదలో ఉన్న గీత కార్మికుల బతుకులు మారడం లేదని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడకుండా లక్షలాదిమంది గీత కార్మికులకు జీవనాధారంగా ఉన్న కల్లుగీత వృత్తిని ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. తాటి కల్లు, నీరా, తాటి ఉత్పత్తులను ప్రోత్సహించి ప్రభుత్వమే ప్రచారం చేయాలన్నారు.

ఏలూరుపాడులో పోలీస్ పికెట్



ఏలూరుపాడులో పోలీసు పికెట్ దృశ్యం

కాళ్ల/భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో శనివారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఇటీవల స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం జరిగింది. ఆ సమయంలో వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆ ప్రాంతంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి సమీపంలోనే వినాయకుడి గుడి ఉండడంతో చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు ఫ్లెక్సీ ఇబ్బందికరంగా ఉందంటూ ఆ ప్రాంత జనసేన నాయకులు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఫ్లెక్సీని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు తొలగించారు. ఈ నేపథ్యంలో శనివారం ఆందోళనలు, ఘర్షణలు జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. అదే సందర్భంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు శాంతియుతంగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి వెళ్లిపోయారు. తొలగించిన ఫ్లెక్సీని వేరే ప్రాంతంలో యంత్రాంగం ఏర్పాటు చేసింది. ప్రజా ప్రతినిధి హోదాలో ఉండి ఇలాంటి ఘటనలకు పాల్పడటం సబబు కాదని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొంది. పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు పెట్టాలి

నరసాపురం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే ఆయనను టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని నరసాపురం మాలల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం క్షమించరాని నేరమన్నారు. ఎమ్మెల్యే ఫొటోలను చెప్పులతో కొట్టి తగులబెట్టారు. సంఘ నాయకులు మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్ కెనడీ, మాలల ఐక్యవేదిక నియోజకవర్గ కన్వీనర్ సోడదాసి శ్రీదర్, కాకిలేటి ఆనంద్, అడిదల శరత్ మాట్లాడుతూ మొదటి నుంచి రఘురామ దళితులపై అక్కసు వెళ్లగక్కుతున్నారని అన్నారు. దేశం మొత్తం గౌరవించే అంబేడ్కర్‌ను ఆయన అవమానించడం దారుణమన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): కాళ్ల మండలం ఏలూరుపాడులో ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం దుశ్చర్యని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. తక్షణం పోలీసులు రఘురామ కృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్లెక్సీ ఇబ్బంది కలిగించే పరిస్థితి వస్తే రెండు వర్గాలను పిలిచి పోలీసుల సమక్షంలో తీయాలే తప్ప ప్రత్యక్షంగా ఒక వర్గాన్ని భుజాన వేసుకుని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. ఒక ఎమ్మెల్యేగా అందరినీ సమానంగా, సోదర భావంతో చూస్తానని ప్రమాణ స్వీకారం చేసి ఇలాంటి కార్యక్రమాల్ని ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే రెండు వర్గాలను కూర్చోబెట్టి సమన్యాయం చేయాలని లేదంటే దేశవ్యాప్తంగా న్యాయపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.



నరసాపురంలో రఘురామకృష్ణరాజు ఫొటో తగలబెడుతున్న మాలల ఐక్యవేదిక నాయకులు

విరాళం ఇవ్వకుంటే పథకాలు బంద్?

- డ్వాక్రా మహిళల నుంచి బలవంతంగా సేకరణ
- జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.4 కోట్లు వసూలు
- గ్రామాల్లో 28 వేలు, పట్టణాల్లో 9,380 డ్వాక్రా గ్రూపుల నుంచి వసూళ్లు



భీమవరం: విజయవాడ వరద బూచిని సాకుగా చూపించి రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల నుంచి నిర్బంధ విరాళాల వసూళ్లు చేపట్టింది. స్వచ్ఛందంగా విరాళాల సేకరణను అందరూ ఆమోదిస్తారు. అయితే డబ్బులు ఇవ్వకపోతే పథకాలు రావంటూ మహిళలను బెదిరించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో రైతులు, రైతు కూలీలు ఇలా అందరూ నష్టపోయారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోగా.. బలవంతపు వసూళ్లు, పైగా బెదిరింపులపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి రూ. కోటికి పైగా వసూలు చేయాలని ఎమ్మెల్యేలకు అనధికారిక ఆదేశాలు రావడంతో ప్రజా ప్రతినిధులంతా విరాళాల సేకరణకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. దానిలో భాగంగానే జిల్లాలోని డ్వాక్రా మహిళల నుంచి సుమారు రూ.4 కోట్లు నిర్బంధ విరాళాల వసూళ్లకు డ్వాక్రా యానిమేటర్స్ నడుం బిగించారు. అనధికారికంగా ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో గ్రామాలు, పట్టణాల్లో వసూళ్లు ప్రారంభించారు.

రూ.4 కోట్ల వసూలుకు ప్రణాళిక

జిల్లా వ్యాప్తంగా సంపన్నులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇప్పటికే పెద్ద మొత్తంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగానే వివిధ వర్తక సంఘాలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు ఆహారం ప్యాకెట్లను విజయవాడ పంపించారు. అయితే జిల్లాలోని డ్వాక్రా మహిళల నుంచి సుమారు రూ.4 కోట్లు విరాళాలు వసూలు చేయాలని ఆదేశాలు రావడంతో మెప్మా అధికారులు, యానిమేటర్స్ రంగంలోకి దిగారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సుమారు 28 వేల డ్వాక్రా సంఘాలుండగా వాటిలో దాదాపు 2.80 లక్షల మంది సభ్యులున్నారు. అలాగే భీమవరం, ఆకివీడు, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో 9,380 గ్రూపుల్లో దాదాపు 97,193 మంది సభ్యులున్నారు. డ్వాక్రా సభ్యురాలు ఒక్కొక్కరు రూ.100 చొప్పున, ఒక్కొక్క గ్రూపు రూ.1,000 ఇవ్వాలంటూ యానిమేటర్స్ ఒత్తిడి తెస్తున్నారు, దీంతో డ్వాక్రా గ్రూపు లీడర్లు ఇంటింటికి తిరిగి డబ్బులు వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని, ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు విరాళాల బాధ ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విరాళాలు ఇవ్వకుంటే ప్రభుత్వ పథకాలు అందవంటూ బెదిరింపు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోవడం మానేసి వసూళ్లా?

ఇప్పటికే విజయవాడ వరద ముంపునకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతుండగా దానికి బాధ్యత వహించి బాధితులను ఉదారంగా ఆదుకోవల్సిన ప్రభుత్వం పేదల నుంచి డబ్బులు వసూలు చేయడమేంటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూలై, ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల నారుమళ్లు, వరినాట్లు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎడతెరిపిలేని వర్షాలు కారణంగా కూలీలు, కార్మికులు, చిరు వ్యాపారులు ఉపాధికోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పైరు దెబ్బతిన్న రైతులకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోగా ఉపాధి కోల్పోయిన వారికి అండగా నిలిచిన దాఖలాలు లేవు.

జిల్లాలో 219.4 మిల్లీమీటర్ల వర్షపాతం

భీమవరం: జిల్లాలోని 20 మండలాల్లో శనివారం ఉదయం 219.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యలమంచిలిలో అత్యధికంగా 40.2 మిల్లీమీటర్లు, ఆచంటలో 35.2, తణుకులో 31.4, ఇరగవరంలో 20, పెనుగొండలో 19.2, నరసాపురంలో 17.2, గణపవరంలో 10.4, పాలకొల్లులో 8.4, మొగల్తూరులో 4.2, కాళ్లలో 2.2, వీరవాసరంలో 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా మిగిలిన చోట్ల అక్కడక్కడా జల్లులు పడ్డాయి.

క్లుప్తంగా

గరిష్ట స్థాయికి తమ్మిలేరు నీటిమట్టం



చింతలపూడి: జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుతోంది. ఈఏడాది తమ్మిలేరుకు ఎగువ ప్రాంతమైన ఖమ్మం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు పశ్చిమగోదావరి జిల్లాలో పడుతున్న వర్షాలకు తమ్మిలేరుకు వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టులో ప్రస్తుతం 346.8 అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం శనివారం తెలిపారు. తాజాగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రాజెక్టు నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయితే.. ప్రస్తుత అల్పపీడన ప్రభావంతో కురిసే వర్షాల వల్ల అపార నష్టం జరుగుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కై కలూరు: కై కలూరు మండలం వింజరం లాకుల వద్ద శనివారం ఎగువనుంచి కొట్టుకు వచ్చి ఒక గుర్తుతెలియని మృతదేహం చిక్కుకుంది. గ్రామస్తులు పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. వీఆర్వో రవితేజా పంచనామా నిర్వహించారు. కై కలూరు టౌన్ సీఐ పి.కృష్ణ మాట్లాడుతూ మృతుని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మరణించి నాలుగు రోజులు దాటి ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు.

తినక తినక మా సొమ్మే తినాలా..

- కార్మికుల పొట్టగొట్టడం అన్యాయం
- సెవెన్‌హిల్స్ సంస్థ మేనేజర్‌పై ధ్వజమెత్తిన శ్రీవారి దేవస్థానం పారిశుధ్య సిబ్బంది
- క్షేత్రంలో రోజురోజుకూ ముదురుతున్న వివాదం
- ఇప్పటికీ కాంట్రాక్టరుకే ఇంజినీరింగ్ విభాగ అధికారుల వత్తాసు
- కార్మికులకు అండగా నిలిచిన 'సాక్షి'



శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండపం వద్ద పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న మేనేజర్

ద్వారకాతిరుమల: తినక తినక మా సొమ్మే తినాలా.. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన సొమ్మును, పీఎఫ్‌ను దోచేశారు. ఒకటి రెండు సెలవులు పెడితే.. నాలుగైదు సెలవులు రాసుకుని జీతం బొక్కేశారు. తక్కువ మంది సిబ్బందిని నియమించి 8 గంటలు చేయాల్సిన పనిని మాతో 12 గంటలు చేయించారు. చీపురు కట్టలు కూడా మేమే కొనుక్కుని పనులు చేస్తున్నాం.. ఇంతకన్నా దారుణం ఇంకేమైనా ఉంటుందా.. సమాధానం చెప్పండి అంటూ శ్రీవారి దేవస్థానం పారిశుధ్య కార్మికులు సెవెన్ హిల్స్ ఫెసిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్‌ను కొండపైన మాధవ కల్యాణ మండపం వద్ద శనివారం నిలదీశారు. దానికి ఆమె సమాధానాలు దాటవేయడంతో కార్మికులు భగ్గుమన్నారు. వివరాల్లోకి వెళితే. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానంలో పారిశుధ్య పనులను మంగళగిరికి చెందిన సెవెన్ హిల్స్ ఫెసిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 2022 అక్టోబర్ 1 నుంచి, 2024 సెప్టెంబర్ 30 వరకు అప్పగించారు. ఈ నెలాఖరుతో టెండర్ గడువు ముగియనుండగా, గడిచిన 23 నెలల కాలంలో కాంట్రాక్టులో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కాంట్రాక్టర్ 132 మంది సిబ్బందిని నియమించాల్సి ఉండగా, 50 మంది కార్మికులను తక్కువగా నియమించి, మూడు షిఫ్టులలో జరగాల్సిన పారిశుధ్య పనులను ఉన్న సిబ్బందితో రెండు షిఫ్టులలో చేయిస్తున్నట్టు సాక్షి పరిశీలనలో బయటపడింది. అంతే కాదు.. కార్మికుల పీఎఫ్ సొమ్మును సైతం దిగమింగారు. అయినా ప్రతినెలా కాంట్రాక్టరుకు దేవస్థానం అధికారులు పూర్తి బిల్లులను చెల్లించారు.

ఒప్పందంతోనే రూ. 9 వేలు జీతం

కాంట్రాక్టరుతో ఆలయ అధికారులు ఒక్కో కార్మికుడికి నెలకు పీఎఫ్, ఈఎస్ఐ ఇతర అలెవెన్స్‌లు పోను మిగిలిన రూ. 8,300 చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే నెలకు నాలుగు సెలవులు ఇవ్వకుండా, షిఫ్టులు వారీగా పనిచేయించి, రూ. 9 వేలు జీతం ఇచ్చేలా కార్మికులకు, కాంట్రాక్టుదారుడికి మధ్య మొదట్లోనే ఒప్పందం జరిగింది. అయితే మూడు షిఫ్టులుగా కాకుండా రెండు షిఫ్టులుగా (12 గంటలు) పనులు చేయించడం, ఓటీలు ఇవ్వకపోవడం, వివాహాలు జరిగే సమయంలో పనిభారాన్ని మరింతగా మోపడం, ఒకటి రెండు రోజులు సెలవులు పెడితే.. నాలుగైదు రోజులు సెలవులు రాసి జీతాల్లో కోత విధించడం వంటి ఎన్నో అవకతవకలు జరిగాయి. వీటిపై కార్మికులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. తాము అడిగిన ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని పారిశుధ్య కాంట్రాక్టు మేనేజర్‌ను నిలదీసినా ఫలితం లేకపోయింది. తనకేమీ తెలియదంటూ ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది.

ఇంజినీరింగ్ విభాగ అధికారుల కనుసన్నల్లో..

మొదటి నుంచి ఈ కాంట్రాక్టు నిర్వహణా బాధ్యతలను ఆలయ ఇంజినీరింగ్ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్ కనుసన్నల్లో జరిగాయి. కాంట్రాక్టు నిర్వహణలో అక్రమాలు జరిగినట్టు, పారిశుధ్య కార్మికులకు అన్యాయం జరిగినట్టు సాక్ష్యాధారాలతో సహా బట్టబయలైనా అధికారులకు చీమ కుట్టినట్టు లేకపోవడం దారుణం. సుమారు రూ. కోటిన్నర మేర సొమ్ము దుర్వినియోగం జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా ఉన్నతాధికారులు విచారణ జరపకపోవడం, కాంట్రాక్టరుపైన, అతడితో లాలూచీ పడిన అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది.

కలెక్టరమ్మా.. న్యాయం చేయమ్మా

పారిశుధ్య కాంట్రాక్టులో జరిగిన అక్రమాలపై సాక్షి దినపత్రికలో ఇటీవల వరుస కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించి, ఇప్పటికే ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావును వివరాలు కోరారు. అయితే ఇంజినీరింగ్ విభాగ అధికారుల ఆధీనంలో ఈ పనులు జరగడంతో ఈఓ త్రినాధరావుకు వారు నివేదిక అందిచకపోవడంతో, కలెక్టర్‌కు వివరాలు చేరలేదని తెలుస్తోంది. దీనిపై కలెక్టర్ ఆగ్రహం చెందినట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఈఓ త్రినాధరావు బదిలీ కావడంతో ఇప్పుడు ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆరా తీసేవారు కూడా లేకుండా పోయారని పలువురు కార్మికులు అంటున్నారు. కలెక్టరమ్మా.. మాకు న్యాయం చేయమ్మా అని సాక్షి ముందు కార్మికులు వేడుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది.

నూజివీడులో పట్టపగలు భారీ చోరీ

20 కాసుల బంగారు నగలు, 5 కిలోల వెండి వస్తువుల చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

నూజివీడు: పట్టపగలు ఓ ఇంట్లో భారీ చోరీ జరగడం నూజివీడులో సంచలనం కలిగించింది. స్థానిక ఎంప్లాయీస్ కాలనీలోని వల్లభనేని రామకృష్ణ(నల్లబాబు)ఇంట్లో శనివారం ఉదయం 10 గంటల తరువాత దొంగలు పడి దాదాపు 20 కాసుల బంగారు నగలు, 5 కిలోల వెండి అపహరించారు. రామకృష్ణ భార్య రెండు రోజుల క్రితం ఊరెళ్లగా, రామకృష్ణ, అతని కుమారుడు కలిసి ఉదయం 9.15గంటల సమయంలో ఇంటికి తాళం వేసి జంగంగూడెంలోని ఇటుకబట్టీల వద్దకు వెళ్లారు. వారిద్దరూ తిరిగి మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో ఇంటికి రాగా, గేట్లు తీసి ఉండటమే కాకుండా తలుపు తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో బీరువాలు తెరిచి వస్తువులన్నీ బెడ్‌పై చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఇంట్లో దొంగలు పడ్డారని నిర్ధారించుకున్న వెంటనే సమాచారాన్ని పట్టణ పోలీసులకు తెలిపారు. మూడు నల్లపూసల గొలుసులు, రెండు డైమండ్ గొలుసులు, ఉంగరాలు, ఇతర గొలుసులు కలిపి దాదాపు 20 కాసుల వరకు బంగారు నగలు పోయాయని, అలాగే నాలుగు వెండి ప్లేట్లు, ఇతర వెండి సామాగ్రి కలిపి 5 కిలోల వరకు పోయిందని బాధితుడు పేర్కొన్నారు.

ఆధారాల కోసం గాలింపు

ఏలూరు నుంచి హుటాహుటిన క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లు సంఘటన ప్రాంతానికి చేరుకున్నాయి. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించగా, డాగ్ స్క్వాడ్‌కు చెందిన పోలీస్ జాగిలం దొంగతనం జరిగిన ఇంటి వద్ద నుంచి ఎస్‌బీసీ కార్యాలయం వరకు, అక్కడి నుంచి వినాయకుని మండపం వరకు వెళ్లి తిరిగి వచ్చేసింది. ఈ ఘటనపై పట్టణ పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



గురదాసు సూర్య కుమారి మృతదేహం



వీరవాసరంలో రహదారిపై ఆందోళన చేస్తున్న దృశ్యం

వీరవాసరం: విద్యుదాఘాతానికి గురై ఓ వివాహిత శనివారం మృత్యువాత పడింది. వీరవాసరం మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన గురదాసు సూర్యకుమారి (33) శనివారం వీరవాసరం గ్రామంలో బిల్డింగ్ నిర్మాణ పనులకు వెళ్లింది. బిల్డింగ్ పైభాగంలో పనులు నిర్వహిస్తుండగా అక్కడ ఉన్న విద్యుత్ లైటుకు అమర్చిన ఇనుప రాడ్డు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న వడ్డిగూడెం గ్రామస్తులంతా సూర్యకుమారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ వీరవాసరం ప్రధాన రహదారిలో ఆందోళనకు దిగారు. స్థానిక పోలీసులు బాధితులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏవీఎస్ మృష్ణాజి తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొండ పైనుంచి పల్టీలు కొట్టిన స్కూటీ

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయం వద్ద ఘటన



తీవ్రంగా గాయపడిన వంకా పోతురాజు





ప్రమాదంలో గాయపడిన బాలుడు కోటం సాయి, వంకా దుర్గాప్రసాద్

జంగారెడ్డిగూడెం: దైవదర్శనానికి వెళ్లి మొక్కుబడులు తీర్చుకుని తిరిగి వస్తుండగా పారిజాతగిరి ఘాట్ రోడ్డులో శనివారం స్కూటీ అదుపు తప్పి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి భక్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన వంకా పోతురాజు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారికి మొక్కుబడులు చెల్లించుకునేందుకు స్కూటీపై పోతురాజు, అతని కుమారుడు వంకా దుర్గాప్రసాద్, బంధువు కోటం సాయి అనే బాలుడు శనివారం ఆలయానికి వచ్చారు. అక్కడ మొక్కుబడులు తీర్చుకుని, స్వామి వారిని దర్శించుకుని తిరుగు పయనమయ్యారు. అయితే ఘాట్ రోడ్డు దిగువ మలుపు వద్దకు వచ్చేసరికి స్కూటీ అదుపు తప్పి సుమారు 20 అడుగుల లోతు ఉన్న లోయలో పడిపోయింది. దీంతో స్కూటీపై పయనిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలో ఉన్న భక్తులు గమనించి 108కి సమాచారం ఇవ్వగా, 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం క్షతగాత్రులను రాజమండ్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై షేక్ జబీర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఏరియా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుల కుటుంబసభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్కూటీ బ్రేక్ ఫెయిల్ అయ్యి అదుపు కాకపోవడంతోనే ఈ ప్రమాదం చేటు చేసుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పారిజాతగిరి ఘాట్ రోడ్డు దిగువ మలుపు వద్ద రెయిలింగ్ లేకపోవడంతో క్షతగాత్రులు తీవ్రగాయాలు కావడానికి కారణమైందని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

భీమవరం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 బాల బాలికల ఎంపిక శనివారం స్థానిక బ్రౌనింగ్ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. నెట్ బాల్, ఆర్చరీ, షూటింగ్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, జిమ్నాస్టిక్స్ విభాగాలలో ఎంపికలను చేపట్టారు. అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె జయరాజు మాట్లాడుతూ 150 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారని, ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా నెట్ బాల్ సెక్రెటరీ దావుద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర పోటీలకు బషీరుద్దీన్



బషీరుద్దీన్

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ కళాశాలకు చెందిన విద్యార్థి షేక్ బషీరుద్దీన్ ఎంపికైనట్లు వీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి శుక్రవారం పేర్కొన్నారు. అండర్-16 విభాగంలో జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు జెడ్పీ హైస్కూల్లో ఇటీవల నిర్వహించిన పోటీలలో బషీరుద్దీన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బషీరుద్దీన్ తమ స్కూల్లో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

బస్టాండ్‌లో గంజాయి పట్టివేత

నరసాపురం: నరసాపురం బస్టాండ్‌లో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.39 వేలు విలువ చేసే 1.900 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి సీఐ బి.యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బస్టాండ్‌లో గస్తీ నిర్వహిస్తున్న ఎస్సై ముత్యాలరావుకు సంచితో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకుని సంచి తనిఖీ చేయగా గంజాయి కనిపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై చెప్పారు. దీని వెనుకాల ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో సెల్‌ఫోన్ చోరీలు పెరిగిపోతున్నాయి. గతంలో బస్టాండ్‌లో, రైల్వేస్టేషన్‌లో, రైతుబజార్ల వద్ద రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యేవి. తాజాగా 'మీ వస్తువులు పడిపోయాయి' అంటూ చెబుతూ అవి చూసేలోపే జేబులో నుంచి ఫోన్లు కాజేస్తున్నారు. శనివారం ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ఉద్యోగి లోనికి వెళుతుండగా ఇద్దరు యువకులు ఏదో వస్తువు కిందపడిపోయిందని చెప్పారు. ఆ ఉద్యోగి కిందకు చూస్తుండగానే జేబులోనుంచి సెల్‌ఫోన్‌ను తీసుకుని మోటారుసైకిల్‌పై ఇద్దరు పరారయ్యారు. ఇదే తరహాలో ఏలూరులో మరోచోట చోరీ చేసినట్టు పోలీసులు చెబుతున్నారు.

క్లుప్తంగా

మా అభివృద్ధి పనులే కొనసాగిస్తున్నారు

మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టెండర్లు పిలిచి ప్రారంభించిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎవరు అధికారంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి ప్రధానంగా ముందుకు సాగుతున్నారన్నారు. తాను రెండు సార్లు అధికారంలోకి వచ్చిన సమయంలో ముందుగా అభివృద్ధికే పీట వేశానని చెప్పారు. మొదటిసారి రూ.600 కోట్లతోను, రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచి ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రిగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.1100 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు వేసి ప్రారంభించామన్నారు. వీటికి సంబంధించి అన్ని వివరాలు పత్రాల రూపంలో తన వద్ద ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులు నిర్మాణ క్రమంలో వివరాలు అవసరమైతే తనను సంప్రదిస్తే తాను వాటి వివరాలు వారికి తెలియజేస్తామన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని మంత్రి కొట్టు తెలియజేశారు.

23, 24న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తణుకు నియోజకవర్గ స్థాయి క్రీడలకు క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 23, 24 తేదీల్లో తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. 23న అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్, 24న కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి ఇప్పటివరకు పోటీలు నిర్వహించామని మండల స్థాయిలో విజేతలైన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలైన వారు జిల్లా స్థాయికి ఎంపికవుతారని వివరించారు.

తణుకు రూరల్ సీఐగా కృష్ణకుమార్ బాధ్యతలు



సీఐగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకుమార్

తణుకు: తణుకు రూరల్ సీఐగా బర్రే కృష్ణకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు రూరల్ సీఐగా పని చేస్తున్న కృష్ణకుమార్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన జీవీవీ నాగేశ్వరరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ మాట్లాడుతూ తణుకు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వరద బాధితులకు విరాళాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడ వరద బాధితుల అండగా దాతలు విరాళాలు అందజేయడం హర్షణీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. వరద బాధితుల సహాయార్థం స్థానిక సుబ్బారావుపేటలోని ఆంగ్లో ఇండియాన్ స్కూల్ విద్యార్థులు ఆధ్వర్యంలో రూ 2,50,000 విరాళం సేకరించారు. విరాళం మొత్తాన్ని డీడీ రూపంలో శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. స్కూల్ చైర్మన్ కొడాలి రమేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో కడకట్ల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: నియోజకవర్గ స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో గూడెం కడకట్ల కోడే వెంకటరావు మున్సిపల్ స్కూల్ విద్యార్థినులు యోగా పోటీలలో ప్రతిభ కనపర్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు తబిత తెలిపారు. యోగా బాలికల విభాగం అండర్–14లో హరిక, అండర్–17లో మహాలక్ష్మిశివాని, బాలుర విభాగంలో పి. అఖిల్‌లు విజయం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు జి.రూపను ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారులకు అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన చెస్ పోటీలలో మాస్టర్స్ చెస్ అకాడమి విద్యార్థులు అండర్–14 బాలికల విభాగంలో జి.సంహిత ప్రథమ స్థానం, అండర్ 14 బాయ్స్ విభాగంలో వి.కార్తీక్ తృతీయ, అండర్ 17 బాయ్స్ విభాగంలో సీహెచ్ మణికంఠ తృతీయ స్థానం సాధించారని కోచ్ చందశేఖర్‌లు అభినందించారు.

పచ్చిపైనే కోసి...మిల్లులకు ఎగుమతి

- ముమ్మరంగా పీఆర్.126 రకం కోతలు
- 75 కిలోల బస్తా రమారమి రూ.1360



ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు పచ్చిపైనే ఖరీఫ్ ధాన్యాన్ని కోసి మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు రెండవ వారం వరకు బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతాంగం అప్రమత్తమైంది. దీంతో తాడేపల్లిగూడెం మండలంలో ముమ్మరంగా వరి కోతలు సాగుతున్నాయి. ప్రధానంగా ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, పట్టెంపాలెం, కొమ్ముగూడెం తదితర గ్రామాల్లో వరి కోత యంత్రాలతో పచ్చిపైనే ధాన్యాన్ని కోసి పట్టుబడి పడుతున్నారు. శుక్ర, శనివారాలు సాయంత్రం వేళలో తాడేపల్లిగూడెం మండలంలో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించినప్పటికీ ఒక్కసారిగా కురుస్తున్న వర్షాలతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకునేందుకు బరకాలతో పరుగులు తీస్తున్నారు. రోడ్ల వెంబడి వేసిన ధాన్యంపై బరకాలను కప్పి తడవకుండా రక్షించుకుంటున్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే పట్టుబడి పట్టి బస్తాల్లోకి ఎక్కించి మిల్లులకు తరలిస్తున్నారు. పచ్చి ధాన్యానికి రైస్ మిల్లర్లు 75 కిలోల బస్తాకు రమారమీ రూ.1360లు ధర చెల్లిస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పండిన పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతాంగం మిల్లులకు విక్రయించి చేతులు దలుపుకుంటున్నారు.



ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం



ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం

క్రీడాకారులు ఆటల్లో రాణించాలి



ఖో ఖో ఆడుతున్న విద్యార్థినులు



యోగా పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ అన్నారు. మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మూడోవ రోజు ఖోఖో, యోగా పోటీల ఎంపికలు నిర్వహించారు. మండల స్థాయి సెలక్షన్స్‌లో మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి అండర్ -14, అండర్- 17 విభాగాల కోసం 430 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరైయారు. పోటీలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల పీడీలు బడుగు చంద్రశేఖర్, హరనాథ్‌రెడ్డి, ఎం.సురేష్, కె.శ్రీనివాస్, యోగా ఇన్‌స్ట్రక్టర్స్ రూపా, కవిత ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఎంపికలను కో ఆర్డినేటర్ ఎ.ఈశ్వర్, చింతకాయల సత్యనారాయణలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీడీలు మాట్లాడుతూ మండల స్థాయి పోటీలు ముగిసినట్లు తెలిపారు. ఈ నెల 25, 26 తేదీలలో నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు.

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి



మాధవరం గర్భిణులకు గుడ్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్



పెంటపాడు: గర్భిణులకు సీమంతాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, తద్వారా గర్భస్థ శిశువు బలవర్ధకంగా ఉంటుందని మాధవరం మాజీ సర్పంచ్ కవులూరి పరిమళ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మాధశరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పరిమళ మాట్లాడుతూ ఆకు కూరల్లో ఎక్కువ పోషకాలు లభిస్తాయన్నారు. మినుములు, సజ్జలు, రాగులు వంటివి ఆహారంలో తీసుకోవాలని, వీటిల్లో ఐరన్ పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్‌వీఎస్. మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.చంద్రావతి, వీకే.మహాలక్ష్మి, పి.హేమలత, కే.ఉదయలక్ష్మి, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

పెంటపాడు: ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కె.పెంటపాడు గ్రామంలో శనివారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పాట్ల ఏడుకొండలు, పెంట్లమ్మ అలయకమిటీ అధ్యక్షుడు పంతం శేఖర్, గ్రామ ప్రముఖులు మల్లెల ప్రసాద్, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

నేతలతో వడ్డి రఘురాం



అప్పడా మాజీ వైస్‌చైర్మన్ రఘురాంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు సంయుక్తంగా కృషి చేయాలని అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం కోరారు. శనివారం తాడేపల్లిగూడెంలో తనను కలిసిన నియోజకవర్గ పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడారు. ఆయన్ని కలిసినవారిలో నియోజకవర్గంలోని ఎల్.అగ్రహారం, కుంచనపల్లి, కృష్ణాయపాలెం, రామన్నగూడెం, పెంటపాడు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉన్నారు.

జాతీయ స్థాయి బూట్ శిబిరానికి తణుకు విద్యార్థుల ఎంపిక

తణుకు టౌన్: ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ సంబల్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయిలో నిర్వహించే కంప్యూటర్ సైన్స్ సెమినార్(బూట్) శిబిరంలో పాల్గొనేందుకు తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్ తెలిపారు. తమ కళాశాల నుంచి ఎల్ సుబ్రహ్మణ్యం, ఎస్ శ్రీలత, కె మహేష్, కె అభిషేక్‌లు జాతీయ స్థాయి బూట్ శిబిరానికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. వీరికి కోఆర్డినేటర్‌గా కళాశాల అధ్యాపకుడు ఆర్ అశోక్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

బలుసులమ్మ దసరా ఉత్సవాల కరపత్రిక ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులు పుర ప్రజలకు ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయాన్ని శనివారం ఎమ్మెల్యే దర్శించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా దేవీ నవరాత్రుల దసరా ఉత్సవాల కరపత్రికను ఆవిష్కరించారు. 3వ తేదీ గురువారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణ, 4వ తేదీ శుక్రవారం శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి, 5వ తేదీ శనివారం శ్రీ గాయత్రి దేవి, 6వ తేదీ ఆదివారం శ్రీ లలితాదేవీ, 7వ తేదీ సోమవారం శ్రీ మహాలక్ష్మీదేవి, 8వ తేదీ మంగళవారం శ్రీ మహాచండి దేవీ, 9వ తేదీ బుధవారం శ్రీ సరస్వతీ దేవి, 10వ తేదీ గురువారం వనదుర్గా దేవీ, 11వ తేదీ శుక్రవారం శ్రీ మహిషాసుర మర్దినీ దేవి, 12వ తేదీన శ్రీ రాజరాజేశ్వరీదేవీ అలంకరణ, అదే రోజు తెప్పోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కుంకుమ పూజలు, విశేష పూజలలో భక్తులు పాల్గొనాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

వైద్యులు హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలి

- సెలవులు ఇవ్వబడవు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యవర్గాలకు సూచనలు
- పీహెచ్‌సీ వైద్యుల సమ్మె ముగిసేవరకు అప్రమత్తంగా ఉండాల్సిందే
- ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ఓపీ సంఖ్య



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) ఆస్పత్రులకు సంబంధించి రోగులు, గర్భిణులు, బాలింతలకు సత్వర వైద్యసేవలు అందించే క్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం కొన్ని ఆదేశాలు జారీ చేసియున్నారు. ఈ మేరకు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్యులు, సిబ్బందికి విధివిధానాలు జారీచేశారు. పీజీ వైద్యవిద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ జారీ చేసిన జీవో 85ను రద్దుచేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేస్తున్న సమ్మె నేపథ్యంలో రోగుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యవర్గాలకు ఈ ఆదేశాలు వర్తించనున్నాయి. రోగులతోపాటు ముఖ్యంగా గర్భిణులు, జ్వరపీడితులు వైద్యసేవల కోసం పట్టణ పరిధుల్లో ఉండే ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితి ఇప్పుడు నెలకొంది. ఇందుకు అనుగుణంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇప్పటికే ఓపీ సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా గర్భిణులు ఇతర ప్రాంతాల నుంచి తణుకు ఆస్పత్రికి వైద్యసేవల కోసం అధికసంఖ్యలో వస్తున్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలివి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా విధుల సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.
- వైద్యవర్గాలు ఆస్పత్రి హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసముండాలి.

సత్వర వైద్యసేవలందిస్తున్నాం



రోగులు, గర్భిణులు, బాలింతలు, జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే వారికి సత్వర వైద్యసేవలందించే విధంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యుల సమ్మె కారణంగా ఆస్పత్రిలో రద్దీ పెరిగిన నేపథ్యంలో వైద్యవర్గాలను అప్రమత్తం చేశాం. ముఖ్యంగా ఆస్పత్రిలో వైద్యసేవలకుగాను, ఇతర సమాచారానికిగాను ల్యాండ్‌లైన్ 08819 222175 నంబరులో సంప్రదించవచ్చు.

– డాక్టర్ వెలగల అరుణ,
తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె ముగిసే వరకు డీఎస్‌హెచ్ వైద్యులకు ఎటువంటి సెలవులు మంజూరు చేయబడవు.
- ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యులు లేరనే సమాధానంతో ఎట్టి పరిస్థితుల్లోను అవసరం లేకుండా మరొక ఆస్పత్రికి రిఫరల్ చేయరాదు.

తెలంగాణ గణనాథుడి నిమజ్జన ఊరేగింపు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో నిజమ్జనానికి వెళ్తున్న భారీ గణనాథుడు

తణుకు అర్బన్: వినాయకచవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా తణుకు సజ్జాపురంలోని మండపంలో ఏర్పాటు చేసిన గణనాథుడు నిమజ్జన ఊరేగింపు తణుకులో సందడి చేసింది. సజ్జాపురం రామాలయం ప్రాంతంలో లక్ష్మి గణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణలోని ధూల్‌పేట నుంచి 17 అడుగుల భారీ గణనాథుడిని తీసుకువచ్చి ఇప్పటివరకు మండపంలో ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. శనివారం స్వామివారిని నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో క్రేన్ సాయంతో ఎక్కించారు. సజ్జాపురం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా నిర్వహించిన ఊరేగింపులో తీన్‌మార్ డప్పులు, బ్యాండు మేళాలు, బాణాసంచా కాల్పులు అలరించాయి. భారీ గణనాథుడిని చూసేందుకు భక్తులు రోడ్డుపైకి వచ్చి పండ్లు, ప్రసాదములు సమర్పించి తీర్థప్రసాదములు స్వీకరించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త వారికి అవకాశం కల్పించాలి



సామాజిక తనిఖీ గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ పోతుల అన్నవరం

తాడేపల్లిగూడెం రూరల్: జాబ్ కార్డులు పొంది పనులకు రాని వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి రైతు సేవా కేంద్రంలో 2023–24వ సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడారు. తొలుత డీఆర్‌పీ బాల చెన్నయ్య ఆడిట్ నివేదికను ప్రవేశపెట్టారు. ఉపాధి హామీ పథకం 58, పంచాయతీ రాజ్ పనులు మూడు వెరసి 61 పనులకు గాను మొత్తం రూ.22,19,140లు పనులపై గ్రామస్తుల ఆమోదాన్ని కోరారు. అనంతరం గ్రామ సభ ముగించారు. పుల్లాయగూడెంలో రూ.26,28,264 పనులకు డీఆర్‌పీ జి.చంద్రబాబు నివేదిక సమర్పించారు. నవాబుపాలెం, బంగారుగూడెం గ్రామాల్లోనూ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభలు నిర్వహించారు. పుల్లాయగూడెం సర్పంచ్ చీకట్ల పుష్పలక్ష్మికుమారి, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సచివాలయ కార్యదర్శులు రవిచంద్ర, మాధవి, టీఏ వీరవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసాద్

పెంటపాడు: గురజాడ రచనలు స్థిరస్థాయిలో నిలిచి పోతాయని కన్యాశుల్కం నాటకం రచన యుగాంతం వరకు ఉంటుందని పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. మహాకవి గురజాడ జయంతి వేడుకలు శనివారం కళాశాల వద్ద ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుంకర గోపాల్, విడతల రామచంద్రుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురజాడ జీవితం, ఆయన రచనల ద్వారా విద్యార్థులు ఎంతో గ్రహించాలన్నారు. విద్యార్థులకు ఇటీవల గురజాడ సాహిత్యంపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విక్టర్ ప్రేమ్‌సాగర్, ఎస్. శ్రీనివాసరావు, అంజిబాబు, బి. సురేంద్ర, జాన్‌బాబు, కళాశాల అద్యాపక బృందం తదతరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: మహాకవి గురజాడ వెంకట అప్పారావు తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని ఆయన రచించిన కన్యాశుల్కం ఎంతో ప్రసిద్ధి చెందిందని తణుకు సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. శనివారం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా తణుకులోని 13వ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కోట సుందర రాజ్, హెచ్‌ఎం ఆదూరి రాజేశ్వరి, కళ్యాణి, జయంతి, బంగారమ్మ, ప్రసాద్, మోహనరావు, జహంగీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు సీఐటీయు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు తమ సమస్యలను మిడ్డే మీల్స్ కార్మికులు విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చినట్లు సీఐటీయు నాయకులు చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు, కండెల్లి సోమరాజు తెలిపారు. సంఘ నాయకులు కే.నాగమణి, ఎస్.అరుణ, తులాలక్ష్మి, పల్లి కవిత, పి.జయమ్మ, కే.దుర్గాదేవి, పుష్పావతి, మిద్దే లక్ష్మి, మానూరి గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో చెరుకు వడ్డికాసులు, బాలికల విభాగంలో దండే మమత, అండర్–14 బాలుర విభాగంలో పసుపులేటి రాజేష్, కే.హేమంత్, బాలికల విభాగంలో కోట లక్ష్మి, అర్జుల మానసలు ఉన్నట్లు పీడీ బడుగు చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం సీహెచ్. చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సమన్వయంతో పనిచేయండి

తాడేపల్లిగూడెం: అధికారులు సమన్వయంతో పనిచేసి మునిసిపాలిటీని ప్రథమస్థానంలో నిలపాలని శనివారం మునిసిపల్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు కోరారు. విజయవాడ వరదల సమయంలో గూడెం పారిశుద్ధ్య సిబ్బంది అందించిన సేవలు అమోఘమన్నారు.గత ఐదుసంవత్సరాలలో మునిసిపాలిటీ నిర్వీర్యమైందన్నారు. రాజీనామా చేయని వలంటీర్లను సచివాలయాలలో వివిధ సేవల కోసం వినియోగించుకుంటామన్నారు.

ప్రజలపై భారం మోపడమే బీజేపీ ధ్యేయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిత్యావసరాల పెంచి ప్రజలపై భారం మోపడమే కేంద్రంలో బీజేపీ ధ్యేయంగా పని చేస్తుందని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా రాజకీయ తరగతులు శనివారం పట్టణంలో షాదీఖానాలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, నూనె ధరలతో పాటు నిత్యావసరాల ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టాలని తాగునీటిని ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్, సహాయ కార్యదర్శి గ్రీష్మకుమార్, యర్రా శ్రీనివాసరావులు మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. కార్మికులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతితోనే దేశాల అభివృద్ధి సాధ్యం

తణుకు టౌన్: ప్రపంచంలో ప్రతి ఒక్కరూ శాంతిని సంస్కృతిగా పాటించాలని డీవీవీఎస్ వర్మ చెప్పారు. ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ యూ లక్ష్మీసుందరి బాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ ప్రపంచం శాంతియుతంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.